సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం : 23 : జనవరి : 2025



కాఫీ కొనుగోలు ధరల పెంపు

- జీసీసీ చింతపల్లి డీఎం దేవరాజ్

చింతపల్లి: గిరిజన రైతుల నుంచి కాఫీ కొనుగోలుకు సంబంధించి ధరలను మరింత పెంచుతూ గిరిజన సహకార సంస్థ ఎండీ ఉత్తర్వులు జారీచేసినట్టు చింతపల్లి జీసీసీ డీఎం దేవరాజ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పెంచిన ధరల మేరకు ఇక నుంచి పార్చ్‌మెంటు కిలో రూ.350, చెర్రీ రూ.200, రొబస్టా రూ.130 చొప్పున కొనుగోలు చేస్తామని ఆయన పేర్కొన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కాఫీ రైతుల ఇళ్ల వద్దకే వెళ్లి తమ సిబ్బంది కొనుగోలు చేస్తారన్నారు. కాఫీని విక్రయించిన తరువాత రెండు రోజుల వ్యవధిలోనే నేరుగా రైతుల ఖాతాల్లో నిధులు జమచేస్తామని డీఎం పేర్కొన్నారు.

కూటమి ట్యాక్స్

నెలకు రూ. 2 కోట్లు


మార్టూరు క్వారీలో మైనింగ్ కార్యకలాపాలు



అనకాపల్లి మైనింగ్‌లో వసూళ్ల పర్వం

రోజుకు 1000 ట్రిప్పులు....

ఇందులో 150 పోను...

మిగిలిన 850 ట్రిప్పులకు

రూ.22 వేల చొప్పున

మొత్తం రూ.1.87 కోట్లు!!

ఇవేం లెక్కలు అనుకుంటున్నారా.... అనకాపల్లి నియోజకవర్గంలో **అక్రమ మైనింగ్** వ్యవహారంలో కూటమి **నేతలు చేస్తున్న** నెలవారీ వసూళ్ల లెక్కలివి. **మైనింగ్ శాఖతో** పాటు రవాణా, పోలీసు, **రెవెన్యూ శాఖల** అధికారులకు నెలనెలా **ముడుపులు** ముడుతున్నాయనీ, అందు**కే అనేక** అవకతవకలు జరుగుతు**న్నా చర్యలు** తీసుకోవడం లేదని **విమర్శలు వినిపిస్తున్నాయి.**

సాక్షి ప్రతినిధి, **విశాఖపట్నం:**

- చక్కర్లు కొడుతున్న లారీలు రోజుకు 1000
- ట్రిప్పునకు రూ.22 వేల వంతున వసూళ్లు
- అందులో ఎంపీ రమేష్ లారీలకు మినహాయింపు
- 32 టన్నుల లారీలో 50 టన్నుల బోల్డర్లు
- ఒక్కో లారీలో 14–18 టన్నుల మేర అధిక లోడు
- అధికార, అనధికారిక క్వారీల నుంచి అడ్డగోలు వసూళ్లు
- పట్టించుకోని వివిధ శాఖల అధికారులు

కొత్త ప్రభుత్వంలో సరికొత్త **టిప్పర్లు.. ఎక్కడా** తేడా రాకుండా ఎంచక్కా వాటాలు.. ఎవరూ నోరు తెరవకుండా ఎక్కడికక్కడ ఏర్పాట్లు.. కూటమి ప్రభుత్వంలో మైనింగ్ దందా ఎంత పకడ్బందీగా సాగిపోతోందో చూడండి.. అనకాపల్లి నియోజకవర్గంలో ఉన్న వివిధ క్వారీల ద్వారా రోజుకు 1,000 ట్రిప్పుల్లో బండరాళ్లు తరలిపోతున్నాయి. వివిధ అధికార, అనధికార క్వారీల నుంచి మునగపాక మీదుగా రోడ్లపై భారీ శబ్దాలు చేస్తూ రాంబిల్లిలోని నావికాదళ పనుల వరకూ ప్రతి రోజూ చక్కర్లు కొడుతున్నాయి. 32–36 టన్నుల సామర్థ్యం కలిగిన టిప్పర్లలో ఏకంగా 50 టన్నుల మేరకు భారీ బండరాళ్లు వేసుకుని తిరుగుతున్నా ఈ టిప్పర్ల వైపు అటు మైనింగ్ అధికారులు కానీ, ఇటు రవాణాశాఖ, పోలీసు, రెవెన్యూ అధికారులు కానీ కనీసం కన్నెత్తి చూడటం లేదు. ఇందుకు కారణం ప్రతి నెలా ఒక్కో ట్రిప్పునకు రూ.22 వేల చొప్పున కూటమి నేతలు ట్యాక్స్ వసూలు చేస్తుండటమే. ఇందులో అనకాపల్లి ఎంపీకి చెందిన సీఎం రమేష్ ట్రిప్పులను మినహాయించి మిగిలిన 850 ట్రిప్పులు తోలుతున్న వివిధ సంస్థలు, వ్యక్తుల నుంచి నెలకు ఠంచనుగా రూ.22 వేల మేర వసూలు చేస్తున్నారు. ఈ లెక్కలన్నీ అనకాపల్లికి చెందిన కూటమి నేత బంధువు చూస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధిక లోడుతో వస్తున్న ఈ వాహనాల రాకపోకలపై ఎటువంటి నియంత్రణ లేకపోవడంతో రోడ్లన్నీ ఛిద్రమవుతున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో నెలవారీగా వసూలవుతున్న మొత్తం రూ.1.87 కోట్లలో కూటమి నేతలతో పాటు మైనింగ్, రవాణా, పోలీసు, రెవెన్యూ అధికారులకూ భారీగా వాటాలు అందుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



దగ్గరుండి మరీ పర్యవేక్షణ..!

అనకాపల్లి నియోజకవర్గంలో 20 క్వారీలకు అధికారికంగా అనుమతి ఉంది. మరో 30 అనధికారిక క్వారీలను కలుపుకుని మొత్తం 50 క్వారీల నుంచి ప్రతి రోజూ సగటున 1,000 ట్రిప్పుల బండరాళ్లు తరలిపోతున్నాయి. రాంబిల్లి వద్ద నావికాదళానికి సంబంధించి అణు జలాంతర్గాముల కోసం ప్రత్యేకంగా ఐఎన్ఎస్ వర్ష పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సముద్రంలో కొన్ని కిలోమీటర్ల మేర దారిని నిర్మించాల్సి ఉంటోంది. ఇందుకోసం భారీ బండరాళ్లతో నింపే పనులు జరుగుతున్నాయి. వీటి కోసం అవసరమైన బండరాళ్లను ప్రధానంగా అనకాపల్లి నియోజకవర్గం నుంచి తరలిస్తున్నారు. ఇందుకుగానూ అనకాపల్లి నియోజకవర్గంలోని జంగాలపాలెం, మార్టూరు తదితర ప్రాంతాల నుంచి భారీ ఎత్తున బండరాళ్లను తీసుకువెళుతున్నారు. ప్రధాన కాంట్రాక్టరుకు అవసరమైన బండరాళ్లను సరఫరా చేసే బాధ్యతలను పలువురు సబ్ కాంట్రాక్టు కింద తీసుకున్నారు. ఇందులో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌తో సహా పలువురు స్థానిక కాంట్రాక్టర్లు, కూటమి నేతలు ఉన్నారు. వీరికి చెందిన భారీ టిప్పర్లకు బండరాళ్లను ఎత్తుతున్నారు. నిబంధనల మేరకు ఆయా టిప్పర్ల సామర్థ్యాన్ని బట్టి 32 నుంచి 36 టన్నుల వరకు మాత్రమే తరలించాల్సి ఉంటుంది. అయితే, వీటిలో 50 టన్నుల మేరకు బండరాళ్లను తరలిస్తున్నారు. ఈ అదనపు లోడును చూసీ చూడనట్టుగా ఉండేందుకుగానూ నెలకు ట్రిప్పునకు రూ.22 వేల చొప్పున వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రతి రోజూ ఎన్ని ట్రిప్పులు వెలుతున్నాయనే లెక్కలను చూసేందుకు కూటమి నేత బంధువు దగ్గరుండీ మరీ పర్యవేక్షిస్తున్నట్టు తెలుస్తోంది. ఆయనకు సంబంధించిన వ్యక్తులను ఆయా క్వారీల వద్ద ఉంచి... లెక్కలు కడుతున్నారు. లెక్కలను చూసుకుని ప్రతి నెలా వసూళ్లకు తెగబడుతున్నట్టు తెలుస్తోంది.

అందరికీ వాటాలే..!

ఈ అనధికారి అక్రమ మైనింగ్ వ్యవహారంలో కూటమి నేతలతో పాటు అధికారులకు కూడా ప్రతి నెలా వాటాలు అందుతున్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధిక లోడుతో వెళుతున్న వాహనాలను చూసీ చూడనట్టుగా ఉండేందుకు వీలుగా రవాణాశాఖ అధికారులకు ప్రతి నెలా మామూళ్లు ముట్టచెబుతున్నట్టు ఆరోపణలున్నాయి. ఇక అనధికారిక క్వారీల్లో జరుగుతున్న మైనింగ్‌ను పట్టించుకోకుండా ఉండేందుకుగానూ మైనింగ్ అధికారులకూ భారీగా ముడుతోందన్న విమర్శలున్నాయి. అక్రమ మైనింగ్‌తో పాటు అధిక లోడుతో భారీగా రాయల్టీ రూపంలో ప్రభుత్వ ఖజానాకు గండిపడుతోంది. అయినప్పటికీ వీరికి చీమ కుట్టినట్టు కూడా ఉండటం లేదు. ఇక మైనింగ్ విజిలెన్స్ అధికారులు కనీసం ఒక్కటంటే ఒక్కసారి కూడా దాడులు చేసి అక్రమ మైనింగ్‌ను నిలిపివేసేందుకు గత 7 నెలల కాలంలో ప్రయత్నించలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. మరోవైపు స్థానిక పోలీసు, రెవెన్యూ, విజిలెన్స్ ఇలా అన్ని విభాగాల అధికారులకు వాటాల లెక్కన పంచుతున్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారాలన్నీ కూటమి నేత బంధువు దగ్గరుండీ మరీ చూస్తున్నట్టు తెలుస్తోంది. ఎవరి వాటా ఇచ్చిన తర్వాత మిగిలిన భారీ మొత్తాన్ని సదరు కూటమి నేత బంధువు జేబులోకి వెళుతోంది.

ఏకంగా కొత్త టిప్పర్లు!





ఈ వ్యవహారాలు సజావుగా సాగడంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కీలకపాత్ర పోషిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. మరోవైపు ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.... గత కొద్ది రోజులుగా కొత్త టిప్పర్లు ఈ మైనింగ్ క్వారీల నుంచి రాంబిల్లి వరకూ హోరెత్తిస్తున్నాయి. కేవలం ఈ బండరాళ్లను సరఫరా చేసేందుకే కొత్తగా సీఎం రమేష్‌తో పాటు ఆయనకు సంబంధించిన వ్యక్తులు 100 వరకూ కొత్త టిప్పర్లను కొనుగోలు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. మరోవైపు బండరాళ్లను తీసుకెళుతున్న పలు ఇతర సంస్థలకు చెందిన భారీ టిప్పర్లలో కొన్నింటికి నెంబరు ప్లేట్లు కూడా లేకపోవడం గమనార్హం. అయినప్పటికీ రవాణాశాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇక ఇష్టారాజ్యంగా మైనింగ్ చేపడుతూ.... ఓపెన్ బ్లాస్టింగ్ ద్వారా నిబంధనలకు విరుద్ధంగా ఇంత జరుగుతున్నప్పటికీ అటవీ, పర్యావరణశాఖ అధికారులు కూడా పట్టించుకోకపోవడం వెనుక కూటమి నేతల బలమైన ఒత్తిళ్లే కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

న్యూస్‌రీల్

ఏకలవ్య పాఠశాల తనిఖీ


పాఠశాల సిబ్బందితో డీడీ విజయశాంతి

రాజవొమ్మంగి: స్థానిక ఏకలవ్య పాఠశాలను గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి బుధవారం తనిఖీ చేశారు. పిల్లలకు మెనూ ప్రకారం ఆహారపదార్థాలు అందుతున్నది లేనిది పరిశీలించారు. స్టోర్‌రూంలో రికార్డుల ప్రకారం సరకులు ఉన్నది లేనిదీ తనిఖీ చేశారు. వంటకాల నాణ్యత, పిల్లల హాజరు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రిన్సిపాల్ ఎంవీ కృష్ణారావును, సిబ్బందిని ఆదేశించారు. పిల్లలతో మాట్లాడి సమస్యలు ఏవైనా ఉన్నాయా అని ఆరా తీశారు. వారి పఠనా సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం పిల్లలతో కలసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమెను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు సత్కరించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాడేరు రూరల్: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఫీడర్ల మరమ్మతుల నిమిత్తం ఈనెల 24న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పాడేరు, హుకుంపేట మండలాల్లో కొన్ని గ్రామాలకు సరఫరాలో అంతరాయం ఉంటుందని పాడేరు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏపీఎస్ఎం అప్పారావు తెలిపారు. జి.మాడుగుల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో నుర్మతి ఫీడర్ మరమ్మతు నిమిత్తం బంధవీధి, శింగర్భ, కోరాపల్లి, నుర్మతి, భీరం గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. చింతపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ధారకొండ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం ధారకొండ, దార్లగొంది, ఏనుగుబయలు, చెక్కలదిమ్మ, పెదగంగవరం, డుంబ్రిగుడ విద్యుత్ సబ్ స్టేషన్‌లో కురిడి ఫీడర్ మరమ్మతుల నిమిత్తం కురిడి, కించుమండ, కొర్రాయి, కితలంగి, పెదపాడుకు సరఫరా ఉండదన్నారు. కొయ్యూరు సబ్‌స్టేషన్ మరమ్మతులు నిమిత్తం బుదరాళ్ల పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాలకు సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

పాస్‌పోర్టు కార్యాలయం ఏర్పాటు అభినందనీయం

- సేవలను సద్వినియోగం చేసుకోండి
- అరకు ఎంపీ తనూజరాణి
- గిరిజనులకు తప్పనున్న అవస్థలు


పాస్‌పోర్ట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అరకు ఎంపీ తనూజరాణి, ఎమ్మెల్యే మత్స్యలింగం


పాస్‌పోర్టు అందజేస్తున్న అరకు ఎంపీ తనూజరాణి, ఎమ్మెల్యే మత్స్యలింగం, అధికారులు

అరకులోయ టౌన్: అరకులోయలో పాస్‌పోర్ట్ కార్యాలయం ఏర్పాటు అభినందనీయమని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి అన్నారు. స్థానిక పోస్టాఫీస్ ఆవరణలో ఏర్పాటు చేసిన పాస్‌పోర్ట్ కార్యాలయాన్ని బుధవారం ఆమె ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తాను ఇంటర్ పూర్తి చేసిన తరువాత వైద్యవిద్య నిమిత్తం ఎబ్రాడ్ వెళ్లేందుకు పాస్‌పోర్ట్ కోసం పాడేరు, విశాఖకు సుమారు 45 రోజులు తిరగాల్సి వచ్చిందన్నారు. అరకులోయలో పాస్‌పోర్ట్ కార్యాలయం ఏర్పాటు చేస్తే గిరిజనులకు ఎంతో మేలు జరుగుతుందని పాస్‌పోర్ట్ రీజినల్ ఆఫీసర్ ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఇది జరిగిన తరువాత నెల రోజుల్లో ఆయన ఫోన్ చేసి అరకులో పాస్ పోర్ట్ కార్యాలయం ఏర్పాటు చేస్తున్నట్టు తనకు చెప్పారన్నారు. గిరిజన ప్రాంతంలో ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు ఏవియేషన్ అధికారులతో చర్చించినట్లు ఎంపీ తెలిపారు. ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ అరకులోయలో పాస్ పోర్ట్ కార్యాలయం ఏర్పాటు వల్ల గిరిజన ప్రజలకు అవస్థలు తప్పాయన్నారు. పాస్‌పోర్ట్ సేవ జాయింట్ సెక్రటరీ కేజే శ్రీనివాస్ మాట్లాడుతూ పాస్‌పోర్ట్ కేవలం ట్రావెల్ డాక్యుమెంట్ కాదని, కేంద్ర ప్రభుత్వం అందించే గుర్తింపు కార్డు అన్నారు. గత ఏడాది రాష్ట్రంలో ఐదు లక్షల పాస్‌పోర్ట్‌లు అందించామన్నారు. విశాఖ పోస్ట్ మాస్టర్ జనరల్ విన్నం ఉపేందర్ మాట్లాడుతూ ఏపీలోని 25 పార్లమెంట్ స్థానాల్లో ఎక్కువగా పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో పాస్ పోర్ట్ కార్యాలయాలు నిర్వహిస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతంలోని ప్రతీ ఇంటిలో ఒక పాస్‌పోర్ట్ ఉండాలని, ప్రతీ ఇంటి నుంచి ఒకరు విదేశాలకు వెళ్లాలని కోరారు. పాస్‌పోర్ట్ రీజనల్ ఆఫీసర్ కేఎస్ భాస్కర్‌రావు మాట్లాడుతూ పాస్‌పోర్ట్ కోసం ఏజెంట్లను ఆశ్రయించి మోసపోవద్దని, పోస్టాఫీస్‌కు వచ్చి సేవలు పొందాలన్నారు. అనంతరం ఎంపీ తనూజరాణి, ఎమ్మెల్యే మత్స్యలింగంను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈనెల 16,17 తేదీల్లో ముందస్తుగా దరఖాస్తు చేసిన 8 మందికి పాస్‌పోర్టులను ఎంపీ తనూజరాణి, ఎమ్మెల్యే మత్స్యలింగం, పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి పోస్టల్ సూపరింటిండెంట్ నాగేశ్వరరెడ్డి, తహసీల్దార్ ఎంవీవీ ప్రసాద్, సీఐ ఎల్. హిమగిరి, ఎంపీటీసీ దురియా ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి చెట్టి వినయ్, సర్పంచ్‌లు దాసుబాబు, రమేష్ పాల్గొన్నారు.

75 శాతం ఉద్యోగాలు గిరిజనులతోనే భర్తీ చేయాలి

- డీడీల సొమ్ము రూ.200 అభ్యర్థులకు వెంటనే చెల్లించాలి
- వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి డిమాండ్



సాక్షి,పాడేరు: వైద్య కళాశాల,జిల్లా సర్వజన ఆస్పత్రుల్లో కాంట్రాక్టు,అవుట్‌సోర్సింగ్ పద్ధతిపై భర్తీ చేయనున్న 244 పోస్టుల్లో 75 శాతం ఉద్యోగాలను స్థానిక గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఇండస్ట్రియల్ పాలసీ ప్రకారం 75శాతం ఉద్యోగాలు స్థానికులకు కచ్చితంగా కేటాయించాల్సి ఉందన్నారు.ఈ మేరకు గిరిజన అభ్యర్థులకు న్యాయం చేయాలన్నారు. అలాగే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వైద్య కళాశాల, జిల్లా ఆస్పత్రుల్లో 244 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. అప్పట్లో 10వేలమంది వరకు అభ్యర్థులు రూ.200 చొప్పున బ్యాంకు డీడీలను దరఖాస్తులతో పాటు అందజేశారన్నారు. ఎన్నికల కోడ్ రావడంతో పోస్టుల భర్తీ భర్తీ మెరిట్ లిస్టుల ప్రకటన దశలోనే నిలిచిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గత ప్రభుత్వ యాంలో జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేసిందన్నారు. అయితే అప్పట్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల డీడీ సొమ్ము రూ.200 మాత్రం చెల్లించకపోవడం దారుణమన్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల డీడీ సొమ్మును వెంటనే వారికి చెల్లించాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

క్షయ నిర్మూలనే లక్ష్యం

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సాధన

హుకుంపేట: గిరిజన ప్రాంతంలో క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా వైద్యాధికారులు పనిచేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.సాధన ఆదేశించారు. బుధవారం ఉప్ప పీహెచ్‌సీని ఆమె సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామాల్లో క్షయ వ్యాధి నివారణపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని వైద్యసిబ్బందికి సూచించారు. అనంతరం సంతారి గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రజుమంలో వైద్యాధికారులు మోహన్, కిషోర్, సిబ్బంది సదానందం, సర్పంచ్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంటలో వ్యక్తి హత్య

- మామ, అల్లుడి మధ్య కొట్లాటను అడ్డుకుంటుండగా దాడి
- తలపై తీవ్ర గాయం
- ఆస్పత్రికి తరలించినా దక్కని ప్రాణం
- మృతుడు విశాఖ వాసిగా స్థానికుల వెల్లడి


రాజు మృతదేహం

ఎటపాక : మామ, అల్లుడి మధ్య కొట్లాటను నిలువరించేందుకు వెళ్లిన వ్యక్తి హత్యకు గురయ్యాడు. మంగళవారం రాత్రి మండలంలోని చోడవరం పంచాయతీ ఎర్రగుంట గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ కన్నపరాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎర్రగుంట గ్రామంలో తుమ్మల సునీల్, అతని మామ పొడియం చినచెంచయ్య మధ్య జరిగిన గొడవ కొట్లాటకు దారితీసింది. ఈ క్రమంలో అక్కడే ఉన్న వైజాగ్ రాజు (48) అనే వ్యక్తి ఇద్దరి మధ్య కొట్లాటను ఆపేందుకు వెళ్లాడు. ఈక్రమంలో సునీల్ తన చేతిలో ఉన్న కర్రతో రాజు తలపై బలంగా కొట్టాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు నెల్లిపాకలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే రాజు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. విశాఖ ప్రాంతానికి చెందిన రాజు కొన్నేళ్ల క్రితం ఈ ప్రాంతానికి ఉపాధి నిమిత్తం వలస వచ్చాడు. ఇక్కడ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియరాలేదు. వైద్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు కారకుడైన సునీల్ పరారీలో ఉన్నట్టు సీఐ పేర్కొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- పాడేరు ఇన్‌చార్జీ ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా
- గడుగుపల్లిలో 250 మందికి రగ్గులు, దుప్పట్ల పంపిణీ


పెదబయలులో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందిస్తున్న ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా


గాదేపల్లిలో గిరిజనులకు రగ్గులు, దుప్పట్లను పంపిణీ చేస్తున్న పాడేరు ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా

పెదబయలు: గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని పాడేరు ఇన్‌చార్జీ ఏఎస్పీ నవ జ్యోతి మిశ్రా అన్నారు.బుధవారం మండలంలోని కిముడుపల్లి పంచాయతీ గాదేపల్లిలో క్లీన్ అండ్ గ్రీన్ స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఏఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలో సమస్యలను గిరిజనుల నుంచి తెలుసుకున్నారు.అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో ఏ సమస్యలు ఉన్నా స్థానిక పోలీసు స్టేషన్‌కు లేదా గ్రామ మహిళా పోలీసు ద్వారా అర్జీ అందజేస్తే పరిష్కారానికి పోలీసుశాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. గంజాయి సాగు, రవాణాకు పూర్తిగా దూరం కావాలని సూచించారు. సుమారు 250 మంది గిరిజనులకు రగ్గులు, దుప్పట్లు పంపిణీ చేశారు.

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి: విద్యార్థులు ప్రభుత్వ అవకాశాలు అందిపుచ్చుకోవాలని పాడేరు ఇన్‌చార్జీ ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా అన్నారు.స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల–1,2 విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు,టీ షర్టులు, స్టడీ మెటీరియల్‌ను బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో 198 బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్ కిషోర్, ఇన్‌కం ట్యాక్స్ అధికారి రవిశంకర్ నాయక్, జి.మాడుగుల సీఐ శ్రీనివాస్. పెదబయలు ఎస్ఐ రమణ, పెదబయలు వైస్ ఎంపీపీ సోనే, సర్పంచ్ శోభారాణి, ఎంపీటీసీ కాసులమ్మ పాల్గొన్నారు.

ఏవోబీలో పోలీసులు అప్రమత్తం

ముమ్మరంగా వాహన తనిఖీలు


ముంచంగిపుట్టులో తనిఖీ చేస్తున్న పోలీసులు

ముంచంగిపుట్టు: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో పోలీసులు అప్రమత్తం అయ్యారు. ఛత్తీస్‌గఢ్ ఒడిశా సరిహద్దులో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీకి చెందిన కీలక నేతలు మృతి చెందారు. ఈ నేపథ్యంలో మావోయిస్టులు ప్రతీకార దాడులకు దిగే అవకాశం ఉన్నందున పోలీసులు అప్రమత్తం అయ్యారు. సరిహద్దులో వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. ఎస్‌ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రం నుంచి డుడుమ, జోలాపుట్టు, పెదబయలు మార్గాల్లో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానితులను ప్రశ్నించి విడిచిపెట్టారు. వాహనాల వివరాలను సేకరించారు. సీఆర్‌పీఎఫ్ పోలీసులు బలగాలు సైతం మండల కేంద్రంలో గస్తీ నిర్వహించాయి. ప్రయాణికుల బ్యాగులు, లగేజీలు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్ జరగడంతో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సోదాలు చేస్తున్నామని ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు.

వణుకుతున్న మన్యం

- శీతల గాలులతో అవస్థలు
- దట్టంగా కురుస్తున్న పొగమంచు
- తగ్గిపోతున్న ఉష్ణోగ్రతలు
- అరకువ్యాలీలో 4.6 డిగ్రీల నమోదు


చిన్నగెడ్డ ప్రాంతంలో దట్టంగా కురుస్తున్న మంచు

చింతపల్లి: మన్యంలో చలి తీవ్రత పెరిగింది. శీతల గాలులకు జనం వణికిపోతున్నారు. గత రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. బుధవారం జిల్లాలోని అరకువ్యాలీలో 4.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు అయినట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. గతేడాది జనవరి 7వ తేదీ ఒక్క రోజు మాత్రమే చింతపల్లిలో 6.5 డిగ్రీలు నమోదు కాగా ఈ ఏడాది 21,22 తేదీల్లో 5.5 డిగ్రీలు, 5.6 డిగ్రీలు నమోదు అయ్యాయి. పాడేరు డివిజన్ పరిధిలోని చింతపల్లిలో 5.6 డిగ్రీలు, జి.మాడుగులలో 6.2 డిగ్రీలు, దుంబ్రిగుడలో 6.4 డిగ్రీలు, గూడెంకొత్తవీధిలో 6.6 డిగ్రీలు, హుకుంపేటలో 6.9 డిగ్రీలు, పెదబయలులో 7.1 డిగ్రీలు, అనంతగిరిలో 9.7 డిగ్రీలు, ముంచంగిపుట్టులో 10.0 డిగ్రీలు, కొయ్యూరులో 10.7 డిగ్రీలు నమోదు అయినట్టు ఏడీఆర్ తెలిపారు. ఉదయం 10 గంటలు వరకు మంచు కురుస్తోంది. వాహన చోదకులు హెడ్ లైట్ల వెలుగులో రాకపోకలు సాగిస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి చలిగాలులు వీస్తుండటంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు.

గ్రామ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, తదితరులు

అరకులోయ టౌన్: గిరిజన ప్రాంతంలో చాలా గ్రామాలకు రహదారి సౌకర్యంలేని పరిస్థితి ఉందని, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వార వచ్చే నిధులు రహదారులు నిర్మించేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అధికారులను ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ప్రశ్నించారు. మండల కేంద్రంలోని ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయ ఆవరణలో ఉపాధి పనులపై ప్రజావేదిక బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అరకులోయ ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడారు. వైద్య సేవల కోసం ఆస్పత్రికి వెళ్లాలన్నా గ్రామాలకు రహదారి సౌకర్యం స్థానికులు ఎంతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం దారుణమన్నారు. ఉపాధి నిధులు కోట్లాది రూపాయలు విడుదలైనా కనీస సౌకర్యాల కల్పనకు ఎందుకు దృష్టి సారించడం లేదని ప్రశ్నించారు. వలస వెళ్లే గిరిజనులకు ఉపాధి హామీ పథకం గొప్ప వరం అన్నారు. పీడీ విద్యాసాగర్, విజిలెన్స్ అధికారి నిర్మ దేవి, ఏపీడీ పవన్ కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోషిణి, ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, సర్పంచ్ సుస్మిత, ఏపీవో జగదీశ్వర రావు, ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బూరగ పాఠశాలకు రేకుల షెడ్డు నిర్మాణం


అధికారులకు చేతులు జోడించి కృతజ్ఞతలు తెలుపుతున్న విద్యార్థులు

- కలెక్టర్, ఐటీడీఏ పీవో చొరవతో వసతి సమస్య పరిష్కారం
- కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు, తల్లిదండ్రులు

అనంతగిరి (అరకులోయ టౌన్): మండలంలోని మారుమూల కొండ శిఖర ప్రాంతం రొంపిల్లి పంచాయతీ బూరగ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వసతి సమస్య పరిష్కారమైంది. ఈ పాఠశాలకు భవనం లేక చెట్టు కింద పాఠాలు బోధిస్తున్నట్టు పత్రికల్లో వచ్చిన కథనాలపై కలెక్టర్, పాడేరు ఐటీడీఏ పీవో స్పందించారు. వారి ఆదేశాల మేరకు టీడబ్ల్యూ ఇంజినీరింగ్ అధికారులు రేకులు షెడ్డు నిర్మించారు. ఇందుకు రూ.15 లక్షలు వెచ్చించినట్టు టీడబ్ల్యూ ఏఈఈ గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సోములు, అప్పలరాజు, పెంటయ్య తదితరులు కలెక్టర్, ఐటీడీఏ పీవోకు కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

చోడవరం: అక్రమంగా మద్యం కలిగిన ఒక వ్యక్తిని అరెస్టు చేసి, 31 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు కొత్తకోట ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. డోలవాణిపాలెంలో మద్యం బెల్టుషాపులో ఉన్న ఈ బాటిళ్లను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేశామని ఎస్‌ఐ చెప్పారు. ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మకాలు చేసినా, బెల్ట్ షాపులు నిర్వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

అరకు కాఫీకి విదేశాల్లో ఉన్నత స్థానం


జ్యోతి ప్రజ్వలన చేసి రైతుల సమావేశాన్ని ప్రారంభిస్తున్న అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి, జేసీ అభిషేక్‌గౌడ


కేంద్ర కాఫీ బోర్డు డీడీ కార్యాలయ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి, జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ

- అరకు ఎంపీ తనూజరాణి
- పాడేరులో కేంద్ర కాఫీబోర్డు డీడీ కార్యాలయ భవనం ప్రారంభం

సాక్షి,పాడేరు: అరకు కాఫీ నాణ్యతలో విదేశాల్లో ఉన్నతస్థానంలో ఉండటం గర్వించదగ్గ విషయమని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి అన్నారు. జిల్లా కేంద్రం పాడేరులో రూ.45లక్షలతో నిర్మించిన కేంద్ర కాఫీబోర్డు డీడీ కార్యాలయ నూతన భవనాన్ని జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్‌గౌడతో కలిసి బుధవారం ఆమె ప్రారంభించారు. కాఫీ రైతుల సదస్సును ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు.దేశంలో సిమ్లా యాపిల్, అరకు కాఫీ పేరొందాయన్నారు. అరకు కాఫీకి ఎంతో ఖ్యాతి ఉందన్నారు. గిరిజన రైతులంతా కాఫీతో పాటు అంతరపంటగా మిరియాల సాగుతో మంచి ఆదాయం పొందుతున్నారన్నారు. తాను ఎక్కడకు వెళ్లినా అరకు కాఫీ గురించి మంచిగా మాట్లాడుతారన్నారు. అరకు కాఫీ పేరుతో జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారాన్ని విస్తరించాలని అధికారులకు సూచించారు. కాఫీ రైతులు నాణ్యమైన గింజలను ఉత్పత్తి చేసేలా తన ఎంపీ నిధులు రూ.60లక్షలతో కాఫీ పల్పర్ యూనిట్లు పంపిణీ చేస్తామన్నారు. అరకు కాఫీని రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలు, పేరొందిన షాపింగ్‌మాల్‌లో కూడా విక్రయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కాఫీ బోర్డు అధికారులు ఎంపీని సత్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ, కేంద్ర కాఫీబోర్డు డీడీ మురళీధర్, కాఫీబోర్డు డైరెక్టర్లు కురుసా ఉమామహేశ్వరరావు,విశ్వనాథం, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, ఐటీడీఏ ఏపీవో ప్రభాకర్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రమేష్‌కుమార్‌రావు, ఐటీడీఏ ఏవో హేమలత, ఇన్‌చార్జి కాఫీ ఏడీ అప్పలనాయుడు, స్పైసెస్‌బోర్డు విస్తరణ అధికారి కళ్యాణి, మినుములూరు ఎస్ఎల్‌వో రమేష్, అరకు, చింతపల్లి జేఎల్‌వోలు వీవీ లక్ష్మి, రవికుమార్, రూడకోట సర్పంచ్ కాతరి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



ఆకట్టుకుంటున్న కాఫీ పండ్లు, కాయలతో రూపొందించిన కాఫీ బోర్డు నమూనా

ఏకలవ్యలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

రాజవొమ్మంగి: స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎంవీ. కృష్ణారావు బుధవారం కోరారు. ఆరవ తరగతిలో చేరేందుకు వచ్చేనెల 19లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి అదేనెల 25న ప్రవేశపరీక్ష జరుగుతుందన్నారు. ఈ పాఠశాలలో ఆరవ తరగతిలో 30 బాలికలు, 30 బాలురకు సీట్లు ఉన్నాయని తెలిపారు. అదే విధంగా ఏడు, 8 తరగతుల్లో ఖాళీ సీట్లను కూడా భర్తీ చేస్తామన్నారు. పూర్తి వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని ఆయన కోరారు.

24 నుంచి ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు

సీతమ్మధార: ఏయూ గ్రౌండ్స్‌లో ఈ నెల 24, 25, 26 తేదీల్లో జరగనున్న 43వ ఏబీవీపీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని మహాసభల స్వాగత సమితి ప్రధాన కార్యదర్శి, బీజేపీ నేత పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. నగరంలోని ఓ హోటల్లో ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి యాచంద్రతో కలిసి మీడియాతో మాట్లాడారు. 21 ఏళ్ల తర్వాత విశాఖలో ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి 2,500 మంది ప్రతినిధులు హాజరు కానున్నట్లు వెల్లడించారు.
హక్కుల కోసం పోరాటం మాత్రమ కాకుండ జాతీయవాద భావన, దేశభక్తిని పెంపొందించడం ఏబీవీపీకే చెందిందన్నారు. యాచంద్ర మాట్లాడుతూ ఢిల్లీ విశ్వవిద్యాలయంలో 1949న ప్రారంభమై నేడు 57,87,877 మంది సభ్యత్వంతో ప్రపంచంలో అతిపెద్ద విద్యార్థి సంస్థగా ఏబీవీపీ అవతరించిందన్నారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి 7 నెలలు గడిచిన ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం లాంటి పలు విద్యారంగ సమస్యలపై తీర్మానాలు చేయనున్నట్లు వెల్లడించారు. సభల్లో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు కిరణ్, జిల్లా కన్వీనర్ నితిన్, మహిళా కన్వీనర్ హరిచంద్రిక, ప్రసాద్, రాయుడు నితిన్, ధనుష్, తదితరులు పాల్గొన్నారు.

29న అప్పన్న తెప్పోత్సవం

సింహాచలం : పుష్య బహుళ అమావాస్యను పురస్కరించుకుని ఈనెల 29న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. కొండ దిగువ వరాహ పుష్కరిణిలో సాయంత్రం 5 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఆరోజు సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే సింహగిరిపై స్వామివారి మూలవిరాట్ దర్శనాలు లభిస్తాయని తెలిపారు.

ప్రాంతీయ ఆస్పత్రిలో వైద్యుల పోస్టుల భర్తీకి చర్యలు


మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ శంకర్‌ప్రసాద్, చిత్రంలో డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి

చింతపల్లి: చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యాధికారులు, సిబ్బంది పోస్టుల భర్తీకి అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఉమ్మడి జిల్లా ఆస్పత్రుల సమన్వయ కర్త డాక్టర్ శంకర్ ప్రసాద్ అన్నారు. ఆయన చింతపల్లి మండలంలో బుధవారం పర్యటించారు.జర్రెల పీహెచ్‌సీ పరిధిలోని చౌడుపల్లి పంచాయతీ వాంగెడ్డ కొత్తూరు గ్రామంలో 20 రోజుల వ్యవధిలో ముగ్గురు చిన్నారులు మృత్యువాత పడిన ఘటనపై అధికార యంత్రాంగం స్పందించింది. ఈ ఘటనపై ఇప్పటికే విచారణ జరుగుతుండగా ఈ విషయంపై ఆరా తీసేందుకు ఆయన వచ్చారు. ఆయన ముందుగా గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. అనంతరం ఆయన చింతపల్లి ఆస్పత్రికి వచ్చి డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, సిబ్బందితో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రాంతీయ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది, ఇతర పోస్టుల భర్తీకి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మెరుగైన సేవకు వీలుగా క్యూఆర్ కోడ్ ద్వారా ప్రత్యేకంగా ఫిర్యాదుల విభాగాన్ని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ భక్త వాత్సల్య, వైద్యాధికారులు డాక్టర్ చంద్రశేఖర్, సాయికృష్ణ, ప్రియాంక, భారతి తదితరులు పాల్గొన్నారు.

గోపాల్ సేవలు మరువలేనివి


మృతుడి కుటుంబాన్ని ఓదార్చుతున్న అరకు ఎంపీ తనూజారాణి, ఆమె భర్త వినయ్


గోపాల్ తండ్రి పండుతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవిబాబు

అరకులోయటౌన్: అరకులోయ మండల కార్యదర్శిగా పనిచేస్తూ మృతి చెందిన శెట్టి గోపాల్ కుటుంబానికి బుధవారం అరకులోయ ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజారాణి, ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు వేర్వేరుగా వెళ్లి పరామర్శించి, ప్రగాఢ సానుభూతి. ప్రకటించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోపాల్ మృతికి గల కారణాలను గోపాల్ తండ్రి శెట్టి పండును అడిగి తెలుసుకున్నారు. గోపాల్ మృతి పార్టీకి తీరని నష్టమన్నారు. మృతుడి కుటుంబానికి వైఎస్సార్ సీపీ అన్నివేళల్లో అండగా ఉంటుందని, ఆ కుటుంబ సభ్యులకు ఏ సమయంలోనైనా ఎటువంటి సహాయం కావాలన్నా పార్టీ సిద్ధంగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీకి, ప్రజలకు గోపాల్ చేసిన సేవలు మరువలేనివన్నారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో దుంబ్రిగుడ ఎంపీపీ చటారి జానకమ్మ, ఎంపీపీ బాక ఈశ్వరి, వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాంగి చిన్నారావు, మాజీ ఎంపీటీసీ సుందర్‌రావు, మాజీ సర్పంచ్ ప్రకాశరావు, సర్పంచ్‌లు గుమ్మ నాగేశ్వరరావు, రమేష్, శారద, నాయకులు తదితరులున్నారు.

గిరిజన ప్రాంతాల్లో మరింత మెరుగైన వైద్య సేవలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా


రోగులను పరీక్షిస్తున్న సిబ్బంది, పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా తదితరులు

చింతపల్లి: గిరిజన ప్రాంతాల్లో వైద్యసేవలను మరింత మెరుగుపరుస్తామని, మాతా శిశుమరణాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి జమాల్ బాషా అన్నారు. చింతపల్లి మండలం వాంగెడ్డ కొత్తూరులో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఇటీవల ఈ గ్రామంలో 20 రోజుల వ్యవధిలో ముగ్గురు నవజాత శిశువులు మరణించిన విషయం తెల్సిందే. దీనిపై పాడేరు ఎమ్మెల్యే మత్యరాస విశ్వేశ్వరరాజు అధికారులు, ప్రభుత్వ తీరుపై ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఈ ఘటనపై విచారణ జరపాలని డిమాండ్ చేసిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో వాంగెడ్డ కొత్తూరు గ్రామంలో జర్రెల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో అందరినీ పరీక్షించి అవసరమైన మందులను అందజేశారు. చిన్నారుల మరణాలపై ప్రత్యేకంగా విచారణ చేస్తున్నామని మృతికి గల పరిస్థితులపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా చెప్పారు. చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రి పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ ప్రభావతి, జర్రెల పీహెచ్‌సీ వైద్యాధికారి మణిదీప్, ఎంపీహెచ్‌ఈవో రామకృష్ణ, హెచ్‌వీ సీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణతో ఉపాధి కల్పన


సీఐ నరసింహమూర్తి

అడ్డతీగల: పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రేరణ కార్యక్రమం ద్వారా గిరిజన యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తున్నట్టు అడ్డతీగల సిఐ బి.నరసింహమూర్తి తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ 18 నుంచి 26 ఏళ్లలోపు వయస్సు ఉన్న టెన్త్, డిగ్రీ, సాంకేతిక విద్య అర్హతలు ఉన్న యువతీ యువకులకు ఇన్నోసోర్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థలో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్టు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి విశాఖపట్నం పరిధిలోని అర్హతను బట్టి ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, బయోడేటా ఫారంతో సమీప పోలీస్‌స్టేషన్‌లకు వెళ్లి వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. వివరాలు నమోదు చేయించుకున్న వారు ఫిబ్రవరి 1 న రంపచోడవరంలో ఇన్నోసోర్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


అరకులోయలో ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ విద్యార్థులు

అరకులోయటౌన్: జాతీయ రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా అరకులోయ డిగ్రీ కళాశాల నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ వరకు విద్యార్థులు బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. విశాఖపట్నం నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వరరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడుతూ వాహనచోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. రహదారి భద్రతను పాటించి, ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని కోరారు. విద్యార్థులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితులకు పట్టాల పంపిణీ


పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిరీష, సబ్ కలెక్టర్ కల్పశ్రీ

దేవీపట్నం: మండలంలోని ఇందుకూరుపేటలో బుధవారం జరిగిన కార్యక్రమంలో తాళ్లూరు, రమణయ్యపేట, మంతూరు, దేవీపట్నం తదితర ప్రాంతాలకు చెందిన పోలవరం నిర్వాసితులకు పట్టాలను రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషా, సబ్ కలెక్టర్ కల్పశ్రీ అందజేశారు. నిర్వాసితులు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

కశింకోట: గంజాయి కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధిస్తూ అనకాపల్లి అదనపు జిల్లా కోర్టు జడ్జి నందనవనం శ్రీవిద్య బుధవారం తీర్పు చెప్పారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ తుహిన్ సిన్హా బుధవారం రాత్రి విలేకరులకు తెలిపారు. మండలంలోని తీడ శివారు కచ్చర్లపాలెం కూడలి వద్ద రోడ్డుపై 2013 నవంబర్ 12న అప్పటి ఎస్‌ఐ పి. శ్రీనివాసరావు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ కారులో తరలిస్తున్న 60 కిలోల గంజాయి పట్టుబడింది. కారు డ్రైవర్ దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో అనకాపల్లి అదనపు జిల్లా కోర్టు జడ్జి శ్రీవిద్య నిందితుడికి కఠిన శిక్ష విధించారని ఎస్పీ తెలిపారు. ఈ కేసులో గంజాయి పట్టుకున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీహెచ్. వీరకృష్ణ, ప్రస్తుత సీఐ అల్లు స్వామినాయుడు, సిబ్బంది, కోర్టు మానిటరింగ్ విభాగం సిబ్బంది, అధికారులకు ఎస్పీ ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

కంటి ఆస్పత్రిలో పిల్లల కోసం ఓపీ, ప్రత్యేక వార్డు


చిన్నారితో కలిసి ఓపీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్సీపీసీఆర్ సభ్యుడు గొండు సీతారాం

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఎస్సీపీసీఆర్) ఆదేశాలతో రామాటాకీస్ సమీపంలోని ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో పిల్లల కోసం ప్రత్యేకంగా ఓపీ కేంద్రం, తనిఖీ గది, ఆరు బెడ్లతో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. దీనిని కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షి, వైద్యురాలు జ్యోతిర్మయి, ఆర్ఎంవో నవీన్ కుమార్‌లతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా అన్ని జిల్లాల ప్రధాన ఆస్పత్రుల్లో పిల్లల కోసం ప్రత్యేక ఓపీ కేంద్రాలు, వార్డులు నెలకొల్పాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా గత నెలలో ఆస్పత్రి ఉన్నతాధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో బాలల కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షి మాట్లాడుతూ కమిషన్ ఆదేశాల మేరకు పిల్లల కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి పీఎంవోవో ఉమా శ్రీనివాస్, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ రమణ కుమారి, బాలల సంరక్షణ విభాగం ప్రతినిధులు, చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం జిల్లా ప్రతినిధులు కె.ఎల్లయ్య, ఎం.హరీష్‌కుమార్, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ చేరుకున్న 'షార్జా' బాధితులు

- పోలీస్ కమిషనర్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు
- సీపీ స్పందనతో సురక్షితంగా విశాఖకు


షార్జా నుంచి విశాఖ విమానాశ్రయానికి చేరిన యువకులతో సీపీ శంఖబ్రత బాగ్చి

గోపాలపట్నం: ఉద్యోగాల కోసం షార్జా వెళ్లి, అక్కడ ఉద్యోగం రాకపోవడంతో ఇబ్బందుల్లో పడిన బాధితులు, విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చొరవతో సురక్షితంగా నగరానికి చేరుకున్నారు. బుధవారం విశాఖ విమానాశ్రయంలో సీపీతో కలిసి బాధితులు మీడియాకు తెలిపిన వివరాలు.. గాజువాక ఆటోనగర్లోని మణికంఠ వెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో వెల్డింగ్ శిక్షణ ఇచ్చి, దుబాయ్‌లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్న ప్రకటన చూసి అనకాపల్లి జిల్లా నాతవరం మండలం పీకే గూడేనికి చెందిన పోలుపర్తి లక్ష్మీనారాయణ, గార రాజేష్, పైలా రామస్వామి, శ్రీకాకుళం జిల్లా కంచిలికి చెందిన కాళ్ల వెంకటరావు, విశాఖలోని పెదగంట్యాడ సీకువానిపాలేనికి చెందిన గెద్దాడ లోకేష్‌లు ఆ సంస్థను సంప్రదించారు. ఏజెంట్లు దుర్గాప్రసాద్ అలియాస్ ప్రసాద్, చందులు మణికంఠ వెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్‌లోనే ఇంటర్వ్యూలు, మెడికల్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఎంపికైన వీరికి విశాఖ వెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో వెల్డింగ్ శిక్షణ ఇచ్చారు. అనంతరం గతేడాది నవంబర్ 12న షార్జాలోని క్వాలిటీ ఇంటర్నేషనల్ కంపెనీలో వెల్డర్ ఉద్యోగాలకు పంపారు. అక్కడికి చేరాక వీరికి 6జీ వెల్డింగ్ కాకుండా 3జీ వెల్డింగ్ ఇచ్చి పరీక్షించారు.
అందులో అర్హత పొందకపోవడంతో వెల్డర్లుగా కాకుండా.. లేబర్ ఉద్యోగాలిచ్చారు. వీరంతా టూరిస్ట్ వీసాతో వెళ్లడం వల్ల, కాల పరిమితి ముగిస్తే ఇబ్బందుల్లో పడతామనే ఆందోళనతో ఏజెంట్లను సంప్రదించారు. ఏజెంట్లు సకాలంలో స్పందించక పోవడంతో, విశాఖ నగర పోలీస్ కమిషనర్ నంబర్(7995095799)లో తమ గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే స్పందించిన సీపీ ఇమిగ్రేషన్ అధికారులతో చర్చించి, వెస్ట్, గాజువాక పోలీసుల సహకారంతో ఏజెంట్ల ద్వారా ఈ ఐదుగురిని విశాఖకు తీసుకొచ్చే ఏర్పాట్లు చేశారు. నగరానికి చేరుకున్న వీరు సీపీ శంఖబ్రత బాగ్చికి కృతజ్ఞతలు తెలిపారు.

ఏజెంట్ల వివరాలు సేకరిస్తున్నాం

ఏజెంట్ల ద్వారా ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లి మోసపోకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు సీపీ శంఖబ్రత బాగ్చి మీడియాకు తెలిపారు. విశాఖ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఏజెంట్ల వివరాలు సేకరిస్తున్నామన్నారు. ఇమిగ్రేషన్ అధికారుల సహకారాన్ని తీసుకుంటామన్నారు. బాధితులు విశాఖ వచ్చేందుకు అయిన ఫ్లైట్ చార్జీలు, ఏజెంట్లకు ఇచ్చిన నగదు వారికి తిరిగి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి ఇబ్బందులకు గురిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.